జిల్లా ప్రజలకు కలెక్టర్ బక్రీద్ శుభాకాంక్షలు

నిజామాబాద్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ వేడుకలను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని సౌభ్రాతృత్వం, సుహృద్భావ వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

దాశరథి జయంతి ఉత్సవాలను

ప్రభుత్వం నిర్వహించాలి

- లేదంటే జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తాం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సుభాష్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దాశరథి శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని, లేదంటే జాగృతి ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిర్వహిస్తామని జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రఘునాథ ఖిల్లా జైలును సందర్శించి దాశరథి విగ్రహాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సోయి లేకుండా పరిపాలన చేస్తుందని, దాశరథిని విస్మరించి చరిత్ర హీనులుగా మిగలవద్దని అన్నారు. జూన్ 20, 21న దాశరథి శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించాలని లేదంటే జూలైలో జాగృతి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. ఖిల్లా రామాలయం అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలోనే రూ.2కోట్ల నిధులను కేటాయించామన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. కలెక్టర్ దాశరథి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కళాకారులకు కేంద్ర బిందువుగా ఉందని ఉత్సవాల సందర్భంగా కళాకారులను సన్మానించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రేషన్ షాపుల్లో జనాలు గంటల తరబడి నిరీక్షిస్తున్నారని రేషన్‌ను రెగ్యులర్‌గా అందుబాటులో ఉండే విధంగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘనపురం దేవేందర్, ఆనంద్, దండు నీతూకిరణ్, నవీనాచారి, అవంతిరావు, ప్రభాకర్‌రెడ్డి, మస్త ప్రభాకర్, రజినీష్, రవిచందర్, సుధాకర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రదీప్, తెలంగాణ శంకర్ పాల్గొన్నారు.


సాటాపూర్ రామాలయంలో కవిత పూజలు

రెంజల్, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శుక్రవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీకి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామస్థులంత కలిసి కట్టుగా రామ మందిరం నిర్మించుకోవడం అభినందనీయమని కవిత అన్నారు. ఆమె వెంట రామాలయ ఛైర్మన్ లచ్చావార్ నితిన్, నాయకులు కుర్మె సాయిలు, అంజయ్య, ఏకార్ పాషా, రాఘవేందర్, గోపికృష్ణ, సంతోష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

వామ్మో.. జూన్!







- తల్లిదండ్రులపై ఫీజుల భారం
- జూన్ నెల అంటేనే బెంబేలు
- ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడి
- అడ్మిషన్ల కోసం డొనేషన్లు
- పట్టించుకోని విద్యాశాఖ

నిజామాబాద్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జూన్ నెల వచ్చిందంటే చాలు విద్యార్థుల తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారు. జూన్ 12 నుంచి పాఠశాలల పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల ఫీజులతో పాటు స్కూల్ యూనిఫామ్‌లు, నోట్‌బుక్స్, షూస్, బ్యాగులు ఇలా విద్యార్థులకు కావాల్సిన వాటిని కొనుగోలు చేయాలంటే సామాన్య మధ్య తరగతి వారు బయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు సైతం ఈ విద్యాసంవత్సరం ఫీజులను పెంచేశారు. దీంతో తల్లిదండ్రులకు అదనపు భారం పడుతోంది. జూన్ నెల ప్రారంభానికి ముందే విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులకు అయ్యే ఖర్చు ఎంత, యూనిఫామ్‌ల ఖర్చు, నోట్‌బుక్స్‌ల ఖర్చు, స్కూల్ బస్ ఫీజులు ఇలా అన్నింటిని లెక్కలేసుకునే పరిస్థితి నెలకొంది. తమ నెలవారి ఖర్చులను తగ్గించుకొని పేద మధ్య తరగతి కుటుంబాలు పిల్లల చదువు కోసం వేలల్లో డబ్బులు ఖర్చు చేసే పరిస్థితులు ఉన్నాయి. స్కూల్ ఫీజుల కోసం అప్పులు చేసి తీసుకువచ్చే పరిస్థితులు ఉంటున్నాయి. జీవో నంబర్ 42, 91 ప్రకారం విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలల్లో కమిటీలు వేసి ఫీజుల పెంపు నిర్ణయించాల్సి ఉంటుంది. కానీ అదేమి పట్టనట్లు ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచేశాయి. గత విద్యా సంవత్సరంకంటే 10 నుంచి 20 శాతం ఫీజులను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు పెంచాయి. కొన్ని ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్ల కోసం డొనేషన్లను సైతం వసూలు చేస్తున్నాయి. కొన్ని అనుమతి లేకుండానే పాఠశాలలను ప్రారంభిస్తున్నాయి. విద్యార్థి సంఘాలు అనుమతులు లేని పాఠశాలల విషయంలో ఆందోళనలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం అటువైపు చూడకపోవడం విమర్శలకు తావిస్తుంది. నర్సరీ, పీపీ-1, పీపీ-2 తరగతులకే జిల్లాలో 50వేలకు పైగా ఫీజు ఉందంటే ప్రైవేటు పాఠశాలలు విద్యావ్యాపారాన్ని ఏ విధంగా నిర్వహిస్తున్నారో అర్థమవుతోంది. బయట మార్కెట్‌లో సైతం నోట్‌బుక్స్ రేట్లను పెంచారు. యూనిఫామ్‌లతో పాటు షూస్, బ్యాగులు, టిఫిన్ బాక్స్‌లు ఇతరత్రా ఖర్చులతో సామాన్యులు తమ పిల్లల చదువు కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసే పరిస్థితి ఉంది. జూన్‌నెల వచ్చిందంటే సామాన్య మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాఠశాలల్లోనే నోట్‌బుక్స్ విక్రయాలు..

ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనల ప్రకారం నోట్ బుక్స్, పుస్తకాలను విక్రయించవద్దు. కానీ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలన్నీ తమ పాఠశాలల్లోనే పుస్తకాలను, నోట్‌బుక్స్ విక్రయిస్తున్నారు. పుస్తకాలు, నోట్‌బుక్స్ విక్రయాలలోనే అధిక లాభం వచ్చే అవకాశం ఉండటంతో విద్యాశాఖ నిబంధనలు సైతం తుంగలో తొక్కి మరీ తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. అధిక ధరలకు పుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్ముతూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తమ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని, ఏసీ క్లాస్ రూమ్‌లు, తదితర సౌకర్యాల పేర్లు చెప్పి ప్రైవేటు విద్యాసంస్థలు దోపిడికి శ్రీకారం చుట్టాయి. కొన్ని పేరు పొందిన పాఠశాలలు తమ పాఠశాలల్లో సీట్ల కొరత ఉందని చెప్పి సీటు కావాలంటే డొనేషన్లు తప్పనిసరిగా చెల్లించాలని డొనేషన్లతో అడ్మిషన్లు చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు అదనంగా సెక్షన్‌లను పెంచుకుంటూ నిబంధనలను తుంగలో తొక్కి వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

అడ్డగోలుగా అనుమతులు..

జిల్లాలో ఇప్పటికే 400లకు పైగా ప్రైవేటు విద్యాసంస్థలు ఉండగా ఈ విద్యాసంవత్సరం సుమారు 50కి పైగా ప్రైవేటు పాఠశాలలు జిల్లాలో ఏర్పాటు చేశారు. బ్రాంచీల పేరుతో ఇతర ప్రాంతాల్లోని స్కూళ్లను ఇక్కడ ఏర్పాటు చేసినప్పటికీ వాటికి ఎలాంటి అనుమతులు లేకున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రైవేటు పాఠశాల ఏర్పాటుకు గ్రౌండ్, ఫైర్, శానిటరీ సర్టిఫికెట్లు తప్పనిసరి అయినప్పటికీ అవేమి పట్టనట్లు విద్యాశాఖ సిబ్బంది తూతూ మంత్రంగా తనిఖీలు చేసి నూతన పాఠశాలల ఏర్పాటుకు అనుమతులను ఇచ్చేస్తున్నారు. నిబంధనల ప్రకారం అన్ని వసతులు

మిగతా 8వ పేజీలో...



నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి..

:రఘురాం నాయక్, ఏఐఎస్ఎఫ్, జిల్లా కార్యదర్శి



జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా ప్రైవేటు పాఠశాలలు ఫీజులు పెంచుతున్నారు. కొన్ని పాఠశాలల్లో డొనేషన్ల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారు. విద్యాశాఖ అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. లేదంటే విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం..

:అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి



జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల పెంపు విషయమై ఇప్పటికే కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. ఈ విషయంపై విచారణ చేయాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించాం. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం.

ఉరివేసుకొని దంపతుల ఆత్మహత్య


పులిశెట్టి శ్రీనివాస్, మమత దంపతులు (ఫైల్)

- వడ్డీ వ్యాపారుల వేధింపులే కారణమని సమాచారం
- జిల్లా కేంద్రంలోని గాయత్రినగర్‌లో ఘటన

నిజామాబాద్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గాయత్రినగర్‌లో భార్యాభర్తలు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం వెలుగు చూసింది. గాయత్రినగర్‌లో అద్దె ఇంటిలో ఉంటున్న పులిశెట్టి శ్రీనివాస్ (52), మమత (48) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసే శ్రీనివాస్‌కు భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇటీవల కుమార్తెకు వివాహం చేయగా ఇద్దరు కుమారులు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లినట్లు సమాచారం. నగరంలోని కోటగల్లిలో ఉన్న ఉంటిని అమ్ముకుని ఇటీవల గాయత్రి నగర్‌లో అద్దె ఇంటిలో జీవనం సాగిస్తున్నారు. అయితే గురువారం రాత్రి అప్పుల వారు వేధించినట్లు ప్రాథమికంగా తెలిసింది. అప్పుల వారు వేధించడంతో పరువు పోయిందని దంపతులు మనస్తాపం చెంది ఉరివేసుకున్నట్లు సమాచారం. దంపతుల ఆత్మహత్య విషయంలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని నగర సీఐ శ్రీనివాసరాజు తెలిపారు. ఘటనా స్థలాన్ని నాలుగో టౌన్ పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అధిక వడ్డీ వసూళ్లపై పోలీసు కమిషనర్ సీరియస్‌గా ఉన్నా.. వడ్డీ వ్యాపారుల వేధింపులు ఆగడం లేదు.

నూతన నవోదయ విద్యాలయాల్లో

సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్


పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, చిత్రంలో డీఈవో అశోక్ తదితరులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు నూతనంగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ యేడాది నుంచే తరగతులు నిర్వహించనున్న దృష్ట్యా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని నాగారంలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్ కళాశాల ఆవరణలోని భవన సముదాయంలో తాత్కాలికంగా జవహర్ నవోదయ విద్యాలయాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ శుక్రవారం డైట్ కళాశాలను సందర్శించి తరగతుల నిర్వాహణకు అనువైన పరిస్థితులు, అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించారు. ప్రస్తుత విద్యాసంవత్సరం జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశాలు చేపట్టి తరగతులు నిర్వహించడం జరుగుతుందని రెండు సెక్షన్‌లలో 80 మంది విద్యార్థులు ప్రవేశం పొందుతారని ఈ నేపథ్యంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు, సిబ్బందికి తగిన వసతి, బోధన తరగతుల నిర్వాహణ వంటి వాటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. తరగతి గదులు, డార్మెంటరీ, డైనింగ్ హాల్, లైబ్రేరీ, బాల బాలికలకు వేరువేరుగా హాస్టల్ భవనాలు, స్టాఫ్ క్వాటర్స్ కోసం ఎంపిక చేసిన గదులను పరిశీలించారు. తాత్కాలిక భవనాలలో కొనసాగుతున్న పనులను వేగంగా పూర్తి చేయాలని ఈనెల 12వ తేదీలోపు పనులను పూర్తి చేయాలన్నారు. శాశ్వత భవనం అందుబాటులోకి వచ్చే వరకు డైట్ కళాశాల ప్రాంగణంలోనే జవహర్ నవోదయ కొనసాగుతుందన్నారు. మరమ్మతు పనులను పక్కాగా జరిపించి అన్ని అవసరమైన సదుపాయాలను ఉండేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట డీఈవో అశోక్, జవహర్ నవోదయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ యోహానస్, పంచాయతీరాజ్ ఈఈ శంకర్, తదితరులు ఉన్నారు.

త్యాగానికి ప్రతీక.. బక్రీద్



- ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్న ముస్లింలు
- జిల్లాలో పూర్తయిన ఏర్పాట్లు
- నేడు బక్రీద్

నిజామాబాద్ కల్చరల్/కమ్మర్‌పల్లి జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు పరమపవిత్రంగా భావించే బక్రీద్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. పండగను పురస్కరించుకుని మసీదులు, దర్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఈద్గాల వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. బక్రీద్ పర్వదినం రోజున నూతన వస్త్రాలు ధరించి గ్రామాల్లోని పొలిమేరల్లో ఉన్న ఈద్గాల వద్దకు వెళ్లి వందలాది మంది ముస్లింలు ఒకే చోట చేరి సామూహిక ఈద్ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

బక్రీద్ ప్రాముఖ్యం

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ ముస్లింలందరూ అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం జంతువులను ఖుర్బానీ ఇస్తారు. హజ్ యాత్ర కూడా ఇదే సమయంలో ప్రారంభమవుతోంది. దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాంకు చాలా సంవత్సరాల వరకు సంతానం కలగదు. వయస్సు బాగా పెరిగిన తరువాత అల్లాహ్ దయ వల్ల అతనికి ఒక కుమారుడు జన్మిస్తాడు. అతనికి ఇస్మాయిల్ అని నామకరణం చేస్తారు. అల్లాహ్ హజ్రత్ ఇబ్రాహీం భక్తిని పరిక్షించడానికి తన ముద్దుల కుమారుడు ఇస్మాయిల్‌ను తన కోసం త్యాగం (ఖుర్బానీ)చేయాలని ఇబ్రాహీంను అల్లాహ్ ఆదేశిస్తాడు. అల్లా ఆజ్ఞ ప్రకారం తన కుమారుడు ఇస్మాయిల్‌ను ఖుర్బానీ ఇచ్చేందుకు ఇబ్రాహీం సిద్ధమై ఇస్మాయిల్‌ను ఖుర్బానీ ఇస్తున్న సమయంలో అల్లాహ్ మహిమ వల్ల కుమారుడు ఇస్మాయిల్ పక్కకు నెట్టబడి, అతని స్థానంలో స్వర్గం నుంచి వచ్చిన ఒక గొర్రె పోతు ఖుర్బానీ కాబడుతుంది. అల్లాహ్ పెట్టిన పరీక్షలో దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం నెగ్గుతారు. బక్రీద్ పండుగ సందర్భంగా మేకలు, గొర్రెలు, ఎద్దులు ఇతర జంతువులను ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఆర్థికంగా ఉన్న ప్రతీ ముస్లిం బక్రీద్ పండుగ రోజు జంతువులను ఖుర్బానీ ఇస్తారు. ఖుర్బానీ ఇచ్చిన జంతువు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని నిరుపేదలకు, రెండో భాగాన్ని బంధువులకు పంచి మూడో భాగాన్ని ఖుర్బానీ ఇచ్చిన కుటుంబ సభ్యులు వాడతారు. అందుకే బక్రీద్ పండుగను ఖుర్బానీ పండుగగా వ్యవహరిస్తారు.

ముస్తాబైన ఈద్గాలు

బక్రీద్ ప్రార్థనల కోసం ఉమ్మడి జిల్లాలోని ఈద్గాలన్నీ ముస్తాబైయ్యాయి. ఈద్గాలల్లో ఒకేసారి వందలాది మంది ముస్లింలు కలిసి బక్రీద్ ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు చేయనుండటంతో ఈద్గాలను శుభ్రం చేసి సిద్ధం చేశారు. ఈద్గాల వద్ద నీడ కోసం ప్రత్యేకంగా టెంట్లు వేశారు. తాగునీటి సౌకర్యం కల్పించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పండుగ వేడుకలు ప్రశాంతంగా జరుపుకునేలా, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఈద్గాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పండుగ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఈద్గాలకు వెళ్లి ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపనున్నారు.

ఆగస్టు 14లోపు పేదలకు ఇళ్లను అందించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి


ఇళ్లను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

సుభాష్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 14లోపు జిల్లాలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పేద ప్రజలకు పంచాలని లేకుంటే ఆగస్టు 15న పేద ప్రజలకు ఇళ్లను మేమే పంచుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నతూన కలెక్టరేట్ వెనుక ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇళ్లను గత ప్రభుత్వం కట్టి పేద ప్రజలకు పంచకుండా కాలయాపన చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా అందుబాటులో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇప్పటికే పేదలకు పంచలేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లన్నీ పిచ్చి మొక్కలతో పనికిరానిగా మారుతున్నాయని అన్నారు. ఇళ్లు నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా ఎందుకు పేదలకు పంచడం లేదో అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూంలు నిర్మించి వదిలివేయడంతో నిర్మించిన గృహాలన్నీ పాడుబడ్డ గృహాలుగా మారిపోయాయని ఇళ్లల్లో పాములు తిరుగుతున్నాయని అన్నారు. నాగారంలోని 300లకు పైగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు కలెక్టరేట్ పక్కనగల వందలాది డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పేదలకు పంచాలని కోరారు. 70 రోజుల పాటు సమయాన్ని ఇస్తున్నామని 70 రోజుల్లో పంచకపోతే స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15న పేద ప్రజలకు ఇళ్లను పంచుతామని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మరమ్మతులు చేయించి పేద ప్రజలకు పంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న ఇళ్లను వదిలేసి ఇందిరమ్మ ఇళ్ల పేరిట నాటకాలు ఆడుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి ఉన్న ఇళ్లను కూల్చివేస్తుందన్నారు. కట్టిన ఇళ్లను పేద ప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు మాస్టర్ శంకర్, ఆమందు విజయ్‌కృష్ణ, లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కలిగోట్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జక్రాన్‌పల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగోట్ గ్రామంలో శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2020-21 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలు జ్ఞాపకం చేసుకొని ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు విజయ్ కుమార్, రాజేందర్, ఐగ్రివచారి, రాజన్న, గంగాదర్‌లను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



అక్షయ (ఫైల్)

జక్రాన్‌పల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక మండలంలోని బాలనగర్ గ్రామానికి చెందిన గుంజె అక్షయ (19) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మాలిక్ రెహ్మన్ తెలిపారు. ఎస్సై తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బాల్‌నగర్‌కు చెందిన వెంకట్‌కు కూతురు గుంజె అక్షయను ఏప్రిల్ 30న నిజామాబాద్‌లోని నాగారాంనకు చెందిన పల్లపు సునీల్ అనే వ్యక్తితో వివాహం జరిగిందని తెలిపారు. ఆమె పెళ్ళైన వారం రోజుల నుంచి భర్త సునీల్ భార్య అక్షయని శారీరకంగా వేదించడంతో పుట్టింటికి వచ్చిందని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆమె ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నితో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి గుంజె వెంకట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

రెంజల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన పాముల సాయిలు(50)అనే వ్యక్తి చేపలు పట్టడానికి వెళ్లి మృతిచెందాడని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూనేపల్లి గ్రామానికి చెందిన పాముల సాయిలు గ్రామంలోని చెరువులో చేపలు రోజుమాదిరిగా చేపలు పట్టేందుకు వెళ్తుండేవాడని, శుక్రవారం ఉదయం 5గంటల ప్రాంతంలో గ్రామంలోని రేకుల చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చేపల వల చుట్టుకుని చెరువులో మునిగి చనిపోయాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య పాముల ఇంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మునిపల్లిలో రేషన్ డీలర్‌పై దాడి

జక్రాన్‌పల్లి , జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిపల్లి గ్రామంలో రేషన్ డీలర్ గణేష్, హెల్పర్ అన్విత్‌నాయక్‌పై శుక్రవారం దాడి చేసిన నునవత్ వెంకటేష్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో రేషన్ డీలర్లు ఫిర్యాదు చేశారు. రేషన్ డీలర్‌పై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రేషన్ డీలర్లు మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోలేనిపక్షంలో రేషన్ షాపులను బంద్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు శేఖర్, రాజేశ్వర్, గంగారాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాన్కంపేట్‌లో సీసీ కెమెరాల చోరీ

వేల్పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జాన్కంపేట్ గ్రామంలోని ఐబీసీ చర్చిలో సీసీ కెమెరాలు చోరికి గురైనట్లు పాస్టర్ నోవా తెలిపారు. చర్చిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఆయన తెలిపారు. చోరీ విషయం వేల్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా క్లూజ్‌టీం సభ్యులు చర్చివద్దకు చేరుకొని ఫ్రింగర్‌ప్రింట్ తీసుకున్నట్లు వారు తెలి పారు.

ఇసుక తరలిస్తున్న మినీ టిప్పర్ పట్టివేత

కోటగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కోటగిరి శివారులో శుక్రవారం ఉదయం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మినీ టిప్పర్‌ను కోటగిరి ఎస్ఐ సునీల్ పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్ఐ వాహనాన్ని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ రఫీక్‌తో పాటు ఓనర్ లతీఫ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆలూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్దనుంచి 18 వేల 830 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్‌లు, మూడు మోటర్ బైక్‌లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

కమ్మర్‌పల్లి మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఆర్ నగర్ మాజీ సర్పంచ్ అమరగోని రోజా భర్త మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సదాశివ్ గౌడ్ ను బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శుక్రవారం పరమార్శించారు. ఆయనకు ఇటీవల కంటిశస్త్రచికిత్స జరుగడంతో ఎమ్మెల్యే పరమార్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వీడీసీలు తమ విధానాలను మార్చుకోవాలి

ఆర్మూర్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వీడీసీలు గ్రామాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్, బి. దేవరాములు అన్నారు. కొలిప్యాక వీడీసీ సభ్యులపై కోర్టు విధించిన శిక్ష చూపి తమ ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు ఎం.ముత్తెన్న, బి.కిషన్, యు. రాజన్న పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

రెంజల్,జూన్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన మహిళ (22) అదృశ్యమైనట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మహిళ డిగ్రీ పూర్తి చేసుకుని ఇంట్లో ఉంటుందని గురువారం 11 గంటల సమయంలో నిజామాబాద్‌లో గల ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలకు వెళ్లి స్కాలర్ షిప్ డబ్బులు తీసుకవస్తానని వెళ్లి రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల ఇళ్లలో ఆచూకీ కోసం వెతకగా ఆచూకీ దొరకకపోవడంతో శుక్రవారం తండ్రి హన్మాండ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

యువకుడు...

ఎడపల్లి : మండల కేంద్రానికి చెందిన గట్టుపల్లి సాయికుమార్ (27) అదృశ్యమైనట్టు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మం డల కేంద్రానికి చెందిన గట్టుపల్లి సాయి కుమార్ తన చదువుకు తగ్గట్టుగా ఉద్యోగం దొరకకపోవడంతో గత సంవత్సరం నుంచి ఇంట్లోనే ఉంటూ, తనలో తానే కుమిలిపోయేవాడన్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంట్లో నుంచి బయటకు వెళ్ళిన తాను నేటి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని భార్య గట్టుపల్లి ఆద్రిక శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



పచ్చలనడ్కుడలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



తిమ్మాపూర్‌లో ఊరేగింపు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



హసాకొత్తూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు గ్రామస్థులు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

వేల్పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలను బలో పేతం చేయడానికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని దానికి అనుగుణంగా పాఠ శాలల్లో విద్యార్థుల నమోదును పెంచి పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పచ్చల నడ్కుడ ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతో పాటు నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత దుస్తులు అన్ని రకాల నైపుణ్యాలను సుశిక్షితులైన ఉపాధ్యాయుల ద్వారా విద్య బోధన అందుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం దానికి పేయింటింగ్ పనులతో పాటు మరికొన్ని మరమ్మ తులను వేసవి సెలవుల్లో పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రాథమిక పాఠశాలకు రెండు టాయిలెట్స్ యూనిట్లు మంజూరు చేశామని వాటి పనులు త్వరలోనే మొదలు పెట్టడం జరుగు తుందన్నారు. పాఠాశాలకు అవసరమైనటువంటి అన్నిరకాల మౌలిక సదుపాయాలను కల్పించడానికి తమ వంతు కృషి చేస్తాన న్నారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యా యులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గంగనర్సయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మేతరి మల్లేష్, విడిసి సభ్యులు, పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో బడిబాట

మోర్తాడ్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల విద్యాధికారి తమ్మిరెడ్డి గ్రా మంలో విద్యార్థులు అంగన్‌వాడి కార్యకర్తలతో ఊరేగింపుగా తిరిగి పిల్లల తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాలల్లో గల సదుపాయాల గురించి వివరించారు. బడిఈడు పిల్లలు అందరూ ప్రభుత్వ బడులలో చేరాలని తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలల్లో సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత లేదని, క్రమశిక్షణతో గల విద్యను అందిస్తామని వివరించారు.

కోనాపూర్‌లో బడిబాట కరపత్రాల ఆవిష్కరణ

కమ్మర్‌పల్లి: మండంలోని కోనాపూర్ ఉన్నత పాఠశా తరఫున ప్రచురించిన కరపత్రాలను మండల తహసీల్దార్ జి.ప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాశాలలకు ధీటుగా విద్యాబోదన అందిస్తున్నాయని, ఉచిత పాఠ్యపుస్తకాలు ఏకరూపదుస్తులు మధ్యాహ్న బోజనం, డిజిటల్ విద్యాబోదన, బాలికల ఆత్మరక్షన నిమిత్తం కరాటే తరగతులు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రత్యేక బోదన, త్రిబుల్ ఐటీలో వేయిటేజ్ మార్కులు కార్పోరెట్ కళాశాలల్లో ప్రవేశాలు సైన్స్, గణిత ల్యాబ్‌లు దూర ప్రాంత విద్యార్థులకు రవాణ బత్యం తదితర సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయిలో నివాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయు లు చౌడారపు రాంప్రసాద్, శేఖర్, ఆర్ఐ శరత్, సింగిల్ విండో చైర్మన్ బడాల రమేష్, కాంగ్రెస్ నాయకులు చిన్నోల్ల రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్యా బోధన: తహసీల్దార్

ఏర్గట్ల: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన చేస్తున్నారని తహసీల్దార్ మల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో బడిబాటలో భాగంగా పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బాటలో భాగంగా విద్యార్థుల సంఖ్య పెంచి, తల్లిదండ్రులు ఆశించిన స్థాయిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని సూచించారు. ఎంఈవో ఆనంద్ రావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హసాకొత్తూర్, చౌట్‌పల్లిలలో..

కమ్మర్‌పల్లి: గ్రామాల్లో తల్లిదండ్రులు గ్రామస్తులు తమతమ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని కమ్మర్‌పల్లి మండల విద్యాధికారి ఎస్.ఆంధ్రయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని హసొత్తూర్‌లో, చౌట్‌పల్లి గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణతతో పాటు ఈ పాఠశాలలో చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థుల వివరాలతో కూడిన కరపత్రాలను గ్రామంలో ర్యాలీగా వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమార్, వీడీసీఅధ్యక్షుడు కిషన్ గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ ఏనుగు పద్మా రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్మూర్ రూరల్ : మండలంలోని చేపూర్, పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రతీఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు చేతనకుమారి, శ్రీనివాస్, అమ్మ ఆదర్శపాఠశాల పాఠశాల కమిటి చైర్మన్‌లు మినుగు శిరీష, పర్విన్ సుల్తానా, పంచాయితీ కార్యదర్శి హరీష్‌రెడ్డి, విడిసి అధ్యక్షుడు శ్రీకాంత్, కోశాధికారి రంజిత్, పెర్కిట్ విడిసి అధ్యక్షుడు రాజు, కార్యదర్శి నచ్చు గంగాదర్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలలో బడిబాటపై గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడిబయట, అంగన్‌వాడి కేంద్రా ల పిల్లలను బడిలో నమోదు చేసి చేర్పించాలన్నారు.

కోటగిరి : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధనతో పాటు అన్ని రకాల సదుపాయలు ప్రభుత్వం కల్పిస్తుందని పొతంగల్ ఎంఈవో లోల శంకర్ పేర్కొన్నారు. పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

రెవెన్యూ సదస్సును పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



జన్నేపల్లిలో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్

నవీపేట,జూన్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లి, అభంగపట్నంలలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. జన్నేపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సును అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ పరిశీలించారు. రైతుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, నాయబ్ తహసీల్దార్ రంజిత్ తదితరులున్నారు.

మోర్తాడ్ : మండలంలోని పాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సును ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ సందర్శించారు. రెవెన్యూ సదస్సులో భూసమస్యల పరిష్కారం కోసం రైతులు 58 ధరఖాస్తులు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఆర్ఐ రంజిత్‌కుమార్, సర్వేయర్ నాగేష్, ముక్రం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముప్కాల్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని వేంపల్లి సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో నాలుగో రోజు ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వ హించారు. కార్యక్రమంలో ముప్కాల్ తహసీల్దార్ ముతాంజుద్దిన్, అధికారులు పాల్గొన్నారు.

వేల్పూర్ : మండలంలోని కొత్తపల్లి, వాడి గ్రామాలలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూపరమైన ఎటువంటి సమస్యలున్న ఈ సదస్సులలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వాడిలో గ్రామలో 9, కొత్తపల్లి ఎన్ 4 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాల్, రెవెన్యూ సిబ్బంది మహేష్, శేఖర్, అలేఖ్య, శ్రీనివాస్, శారా, ప్రజ్ఞ, ఉమ, తులసినాయక్ పాల్గొన్నారు.

కోటగిరి : భూభారతి చట్టంతో రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పోతంగల్ తహసీల్దార్ గంగాధర్ పేర్కొన్నారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని సుంకిని, రాంపూర్ గ్రామాలలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, ఉప తహసీల్దార్‌లు అజీజ్, మధు, మాజీ సర్పంచ్‌లు మాధవరావు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : రైతుల భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని, సదస్సులో రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ కిరణ్మయి అన్నారు. శుక్రవారం మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రవీణ్, తహసీల్దార్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మంగల్‌పాడ్ గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించామని, భూ సమస్యలు ఉన్న వారు రెవెన్యూ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎడపల్లి తహసీల్దార్ దత్తాద్రి పేర్కొన్నారు. మంగల్‌పాడ్ గ్రామంలో సుమారు 33కి పైగా వివిధ రకాల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూ సమస్యను పరిష్కరిస్తామని ఎడపల్లి తహసీ ల్దార్ వెల్లడించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్‌లు అనూష, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, బ్రాహ్మణ్‌పల్లి గ్రామ రైతులు తదితరులున్నారు.

కమ్మర్‌పల్లి : రైతులు తామ వ్యవసాయ భూములకు సంబంధించి ఎదుర్కుటున్న సమస్యలు ఏవైన తగు అధారాలతో (దస్తావేజులతో) దరకాస్తులు సమర్పిస్తే సత్వర పరిష్కారం అవుతాయని కమ్మర్‌పల్లి తహసీల్దార్ జి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో కోనాపూర్ సొసైటీ చైర్మన్ బడాల రమేష్, చిన్నోల్ల రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు టేకుల సంజీవ్, ఆర్ఐ శరత్, ఏఆర్ఐ ప్రదీప్ గ్రామ కాంగ్రెస్ నాయకులు చిన్నోల్ల రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కమ్మర్‌పల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన 9 మంది బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సుంకెట బుచ్చన్న పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు బుచ్చిమల్లయ్య, సుంకెట శ్రీనివాస్, అజారోద్దీన్ , జగదీశ్ , సాయి, నాగరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు. మండంలోని హసాకొత్తూర్‌లో బాదితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు బాదత కుటుంబాలకు అందజేశారు.

ఏర్గట్ల : మండల కేంద్రంలో శుక్రవారం గ్రామానికి మెరుగులతకు సీఎం రిలీఫ్ ఫండ్ 34వేలు మంజూరు కాగా ఆ చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, బద్ధం లింగారెడ్డి, ముస్కు మోహన్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఏర్గట్ల మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సోమ రాజేశ్వర్ తండ్రి ఇటీవల మృతిచెందగా శుక్రవారం మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట తాళ్ళరాంపూర్ సొసైటీ చైర్మర్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, బాలాజీ గౌడ్, క్యాతం సుభాష్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పోల్‌ట్యాక్స్‌ను రద్దు చేయాలని వినతి

నవీపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు పోల్ టాక్స్‌ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్వయం ఉపాధి కోసం తాము కేబుల్ ఆపరేటర్ వృత్తికి కొనసాగిస్తున్నామని, ప్రస్తుతం డీటీహెచ్‌ల ఏర్పాటుతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న పోల్ టాక్స్‌ను రద్దు చేయాలని వారు ఏడీఈను కోరారు. ఈ కార్యక్రమంలో కేబుల్ ఆపరేటర్ల సంఘం సభ్యులు ఎన్ఎన్ రెడ్డి, మహేందర్, చల్లా రవీందర్, శ్రీధర్, విజయ్ కుమార్, ప్రశాంత్, గంగాధర్, లక్ష్మణ్ తదితరులున్నారు.

వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలి : ఎంపీడీవో

భీమ్‌గల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీ డీవో సంతోష్ కుమార్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మేరకు శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భగా వసతి గృహంలో పరిసరాలను, విద్యార్థుల రూములను, వంట ప్రదేశాన్ని సందర్శించి లైట్లు, ఫ్యాన్లను పరిశీలించారు. హాస్టల్‌లో అపరిశుభ్రతకు తావివ్వకుండా పరిసరాలతో పాటు గదులు, మూత్రశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయించాలని తెలిపారు. ఎంపీడీవో వెంట వార్డెన్ శ్రీకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అవసరం మేరకు రసాయనాలను వినియోగించాలి

వేల్పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అవసరం మేరకు పంటలకు రసాయనాలను వినియోగించాలని రుద్రూర్ వ్యవసాయ వరి, చెరుకు శాస్త్రవేత్తలు ఏ.కృష్ణచైతన్య, జె. సాయిప్రసాద్‌లు సూచించారు. శుక్రవారం వేల్పూర్ మండలం మోతె గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో వారు మాట్లాడారు. తక్కువ యూరి యా వాడుతూ పంటసాగు ఖర్చు తగ్గించాలని, భూసార పరిక్ష ఫలిత ఆధారిత ఎరువుల యాజమాన్యం చేపట్టాలన్నారు.కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శృతి, మండల వెటర్నరి డాక్టర్ సంతోష్‌రెడ్డి, ఏఈవోలు ప్రశాంత్, తిరుమల, సాయిరామరాజు, షబ్బీర్, జగదీశ్వర్‌రెడ్డి, విడిసి సభ్యులు, గ్రామాభ్యుదయ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టి, సుస్థిర ఆదాయం పొందాలి

ఎడపల్లి : రైతులు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టి సుస్థిర ఆదాయం పొందాలని అసోసియేట్ ప్రొఫెసర్ షహనాజ్ అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో ప్రాంతీయ చెరుకు వరి పరిశోధన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అసోసియేట్ ప్రొఫెసర్ షహనాజ్ మాట్లాడుతూ పొలంలో ఎకరాకు 5-6 లింగాకర్షక బుట్ట లను అమర్చడం. పసుపు, నీలం రంగు జిగురు అట్టలు ఎకరాకు 20 చొప్పున ఉంచు కొని పురుగు యొక్క ఉధృతిని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి, రైతులు తదితరలు ఉన్నారు.

శ్మశాన వాటికకు నిధులు ఇవ్వాలని ఎమ్మెల్సీకి వినతి

నందిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ముస్లీం మైనార్టీ శ్మశాన వాటికకు నిధులు కేటాయించాలని కోరుతూ శుక్రవారం నిజామాబాద్ పట్టణంలోని ఆమె నివాసంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వినతి పత్రం అందజేశారు. తను ఇచ్చిన హామీ మేరకు రూ.15లక్షలు నిధులు కేటాయిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కవితను ఎంఎంసీ నూతన కమిటీ కార్యవర్గం సన్మానించారు. అనం తరం ఆమె సభ్యులకు కండువా వేసి సన్మానించారు. కార్యక్రమంలో నందిపేట ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షులు శౌకతుల్ బారీ, మండల మాజీ కోప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, ఎంఎంసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ మగ్బూల్, ఉపాధ్యక్షులు సయ్యద్ ఖదీర్, షేక్ ఇమ్రాన్, సయ్యద్, సంయుక్త కార్యదర్శి ఫారూఖ్ ఖాన్ ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయం

కోటగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల కోసం ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శుక్రవారం పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా 11ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో ఆయన పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మాక్లూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కోరారు. 11 ఏళ్ల మోదీ ప్రభుత్వం సంకల్పంతో సాకారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలోని వంజరి సంఘం కమ్యూనిటి హాల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగా దినోత్సవం ప్రతీ గ్రామంలో జరిగేవిదంగా చూడాలని పర్యావరణ పరిరక్షణలో భాగంగా మోదీ పిలుపు మేరకు మొక్కలు నాటే కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖార్జి బలిదాన్ జరుపాలని కాశ్మీర్ కోసం ప్రాణాలు అర్పించిన వారి పోరాటాలను ప్రజలకు వివరించాలని కోరారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను, విదానాలను ఎండకడుతూ రాబోయే 25 రోజులు ప్రణాళిక రూపొందించి గ్రామాలలో ఇట్టి కార్యక్రమాలను నిర్వహించే విదంగా పార్టీ కానాయకులు కార్యకర్తలను సమయాత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ కలిగోట గంగాధర్, జిల్లా కార్యదర్శి గంగోని సంతోష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గంగాధర్, మండల శాఖ అధ్యక్షురాలు మమతరాజేశ్వరితో పాటు బొబ్బిలి రమేష్, అనీల్, గంగారెడ్డి, వడ్డెన్న, సత్యనారాయణగౌడ్, రత్నాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

రెంజల్,జూన్6(ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ పనులను వేగవంతం చేయాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి సూచించారు. శుక్రవారం రెంజల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న నిర్మాణం పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తే గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు సరైన వసతులు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, సాయిబాబా గౌడ్, కుర్మె శ్రీనివాస్, రవి, శివ, సాయిలు తదితరులున్నారు.

'మరణానంతర సహాయం రూ.25 లక్షలకు పెంచాలి'

బోధన్‌రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల మరణ అనంతర సహాయం రూ.25లక్షలకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షులు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రాములు మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. న్యాయవాదుల పరిరక్షణ హక్కుల చట్టం అమలులోకి తీసుకువచ్చిన చర్యల గురించి వివరించారు. న్యాయవాది మరణించినట్లయితే 25లక్షల పరిహారం సభ్యులకు ఇవ్వడంతో పాటు విశ్రాంత న్యాయవాదులకు వారి జీవితకాలంలోనే 25లక్షలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహ రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు, రాష్ట్రంలోని బార్ అసోసియేషన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆలూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలంలోని మిర్ధాపల్లి గ్రామంలో ఆశ వర్కర్లు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిం చారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, నీటి తొట్టెలలో నీళ్లు నిలువ ఉండకుండా చూసుకోవాలని, పరిసరా ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు, ఈగలు ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలిపారు.

బాల్కొండలో నిమిషాంబ దేవికి ఘనంగా పూజలు

బాల్కొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బాల్కొండలో 523 సంవత్సరాల నుండి కొలువైఉన్న శ్రీనిమిషాంబ దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం చేసి, మహిళలు ఒడిబియ్యం అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆదిలాబాద్‌కు చెందిన రవి, పుష్ప, ప్రేమ్, సాయి, ప్రణయ్, సువర్ణ, శశిలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిర్వహించారు. వివిధ జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారని ఆలయ పూజారి బి. కృష్ణరావు జోషి తెలిపారు.

కేంద్ర ఉపకార వేతనాలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

కోటగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిన్స్ కమ్ మెరిట్స్ స్కాలర్స్ షిప్ పథకానికి కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో శ్రీనివాస్ రావు తెలిపారు. ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం జిల్లా పరిషత్ పాఠశాలలో అభినందించారు. పాఠశాలకు చెందిన చరణ్, అంజలి, శ్వేత, అన్వేష్, ప్రజిత్, శ్రావణిలు ఎంపిక అయ్యారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్షులు బర్ల సాయిలు, ఉపాధ్యాయులు గణేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



రైతునగర్‌లో నిలిచిన డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణాలు

డబుల్‌కు ట్రబుల్..!

• నిధులు విడుదల కాక నిలిచిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు
• రైతునగర్‌లో లబ్ధిదారుల ఎదురు చూపులు

బీర్కూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా బాన్సువాడ నియోజకవర్గానికి వేలాది డబుల్‌బెడ్ రూంలు మంజూరు అయ్యాయి. పేదలకు వేలాది నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఎన్నికలు రావడం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరడంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల బిల్లులు నిలిచిపోయాయి. దీంతో లబ్ధిదారుల పరిస్థితి గందరగోళంగా మారింది.

• రైతునగర్‌లో నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

2023లో బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామానికి 24 డబుల్ రూమ్ ఇళ్లు మంజూరు అయ్యాయి. డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించడానికి గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్ద ఎకరం మేరా స్థలాన్ని కేటాయించారు. 2023 జూన్‌లో ఇళ్ల నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. ఇందులో 12 ఇళ్లకు స్లాబ్‌లు వేశారు. మిగిలిన 12 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. పిల్లర్లు వేసి వదిలేశారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో లబ్ధిదారుల సొంతింటి కలలకు బ్రేక్ పడినట్లయింది. రైతునగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం 48మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయితే తమ సొంతింటి కల నెరవేరుతుందని భావించారు. కాని బిల్లులు మంజూరు కాక వారి ఆశలు ఆవిరయ్యాయి. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. బిల్లులు మంజూరు చేయించి ఇళ్ల పనులు పూర్తి చేయించి లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు స్థానిక నాయకులు తెలిపారు.



శివరాంమందిర్ రోడ్డు నుంచి ఆసుపత్రి స్థలానికి వెళ్లే దగ్గర మూలమలుపు



ఆసుపత్రికి ఎంపిక చేసిన స్థలం ఇదే..

స్థలం అనువుగా లేకున్నా ఆసుపత్రి నిర్మాణం!

• మండల కేంద్రానికి దూరంగా స్థలం ఎంపిక
• అత్యవసర వైద్యసేవలు పొందే ఆసుపత్రిని దూరంగా నిర్మించొద్దని ప్రజలు, మేధావుల అభిప్రాయం
• వేరే స్థలం పరిశీలించాలని ఉన్నాతాధికారులకు విన్నపాలు

దోమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దోమకొండకు మంజూరైన 50 పడకల ఆసుపత్రిని మండల కేంద్రానికి దూరంగా నిర్మాణం చేపడుతున్నారని, ఉందని, ఆసుపత్రి నిర్మాణానికి అనువుగా లేదని మండల ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరో స్థలాన్ని పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. దోమకొండ మండల కేంద్రానికి ఇటీవల ప్రభుత్వం 50 పడకల ఆసుపత్రిని మంజూరు చేసింది. అందుకు రూ.22 కోట్లు సైతం మంజూరు చేసినట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. అయితే ప్రస్తుతం దోమకొండలో ఉన్న 30 పడకల ఆసుపత్రి (సామాజిక ఆరోగ్య కేంద్రం) ప్రధాన రోడ్డు పక్కనే బస్టాండ్‌కు దగ్గరగా అందరికీ అందుబాటు ఉంది.

ఎంపిక స్థలంలో నిర్మాణం చేపడితే ప్రజలకు తిప్పలు

ప్రసుత్తం ఉన్న ఆసుపత్రి ఎదురుగా బస్టాండ్ ఉండటంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, గర్భిణులు, బాలింతలు ఆటోలు, బస్సులలో ఇతర గ్రామాల నుంచి వచ్చి బస్టాండ్ వద్ద దిగి ఆసుప్రతిలో చికిత్సలు తీసుకుంటున్నారు. ఏదైనా రోడ్డు ప్రమాదం, ఇతర కారణాలతో ఆసుపత్రికి వచ్చేవారు అత్యవసర సమయంలో రోడ్డు పక్కనే ఉన్న ఆసుపత్రికి చేరుకుంటున్నారు. దోమకొండలో పరిశీలించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి రిఫర్ చేస్తే తిరిగి వెళ్లడానికి అనువుగా ఉంది. అయితే నూతనంగా ఎంపిక చేసిన 50 పడకల ఆసుపత్రి నిర్మాణం బస్టాండ్‌కు దూరంగా ఉండటం, ఇరుకైన రోడ్డు ఉండటం, ప్రతీ సోమవారం వారాతంపు సంత ఆ రోడ్డులోనే కొనసాగడం లాంటివి జరుగుతుంటాయి. అత్యవసర సేవలు పొందాలంటే ప్రసుత్తం ఎంపిక చేసిన స్థలంలో నిర్మాణం చేపట్టడం సరికాదని పలువురు మేధవులు చర్చించుకుంటున్నారు.

ఆసుపత్రికి అనువుగా లేకున్నా స్థలం ఎంపిక

ప్రభుత్వం దోమకొండకు నిధులు మంజూరు చేసి 50 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని సంబంధితశాఖ అధికారులకు ఆదేశాలు జారీ కావడంతో ఆ శాఖ అధికారులు అగమేఘాలమీద స్థలం పరిశీలించారు. రెవెన్యూ అధికారులు సైతం అక్కడ ఆసుపత్రి నిర్మాణం చేపట్టేందుకు స్థలం అనువుగా లేకున్నా 1796, 1797 సర్వే నంబర్‌లో నాలుగు ఎకరాల స్థలం కేటాయిస్తున్నట్లు అధికారులు స్థలం చూపి చేతులు దులుపుకున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇతర శాఖ అధికార కార్యాలయాలకు అనువుగా ఉండేందుకు అక్కడ స్థలంలో నిర్మాణం చేపట్టావచ్చని కానీ అత్యవసరమైన చికిత్సలు అందించే ఆసుపత్రిని ప్రస్తుతం ఎంపిర చేసినచోట నిర్మాణం చేపట్టడం సమాంజసం కాదని పలువురు మాట్లాడుకుంటున్నారు.

అంబులెన్స్ వెళ్లాలన్నా అటంకాలే..

ప్రధాన రోడ్డు గుండా ప్రస్తుతం ఆసుపత్రికి స్థలం ఎంపిక చేసిన చోటికి వాహనాలు, అంబులెన్స్ వెళ్లాలంటే అంగడిబజార్ రోడ్డు రద్దీగా ఉంటుంది. రాబోయే రోజుల్లో సైతం ట్రాఫిక్ ఎక్కువగా ఈ రోడ్డు గుండానే పెరిగే ఆవకాశం ఉంది. శివరాంమందిర్ ఆలయం ఉత్సవాలు, సంత ఉన్న రోజుల్లో ప్రజల రద్దీ ఎక్కువగా ఉంటుంది. శ్మశాన వాటిక వెళ్లేందుకు కూడా ఎక్కువగా అంగడిబజార్ మీదుగా ప్రస్తుతం ఆసుపత్రికి స్థలం ఎంపిక చేసిన రోడ్డు గుండా ముత్యంపేట రోడ్డు వైపు శవయాత్రలు వేళ్తుంటాయి. అలాంటి సమయంలో సీరియస్‌గా ఉన్నటువంటి పెషేంట్లు ఆసుపత్రికి చేరుకోవాలంటే ఎక్కువ సమయం తీసుకుంటుంది. ఉన్నాతాధికారులు పునరాలోచన చేసి కామారెడ్డి వెళ్లే మెయిన్ రోడ్డు వైపు స్థలం ఎంపిక చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆసుపత్రి ఇదే..



వాహనాలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

బోధన్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్

• 48 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు సీజ్
• బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో పోలీసులు శుక్రవారం సాయంత్రం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 48 ద్విచక్ర వాహనాలతోపాటు రెండు ఆటోలను సీజ్ చేసినట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు అంబేద్కర్ కాలనీలోని ప్రతీఇంటిని తనిఖీ చేశామని, ఎలాంటి పత్రాలూ లేని 48 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దెఇంట్లో ఉన్నవారి ఆధార్ కార్డులను పరిశీలించామన్నారు. ఇళ్లలో వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించామన్నారు. అక్రమ కార్యకలాపాలకు కళ్లెం వేసేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాలన్నారు. ప్రతీఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, రూరల్ సీఐ విజయ్ బాబు, రుద్రూరు సీఐ కృష్ణ, ఎస్ఐలు, ఎడపల్లి, రెంజల్, బోధన్ రూరల్, రుద్రూరు, వర్ని, కోటగిరిలతో పాటు 80మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

ధర్మమార్గం అనుసరించినప్పుడే జన్మ సార్థకం అవుతుంది

• భక్తిమార్గంతో మానసిక ప్రశాంతత మెరుగుపడుతుంది
• హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

రెంజల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు దైవభక్తిని పెంపొందించుకుని ధర్మ మార్గాన్ని అనుసరించినప్పుడే జన్మ సార్థకం అవుతుందని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి అన్నారు. శుక్రవారం రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలమంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహలతో పాటు నవగ్రహాలు ప్రతిష్టించారు. మూడురోజులపాటు ఆలయంలో వేద పండితులు ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి శుక్రవారం హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి చేతులమీదుగా విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకుని దైవమార్గంలో ప్రయాణించిప్పుడే జన్మ సార్థకం అవుతుందని అన్ని ధర్మాలలో కెల్లా హిందూ ధర్మరం పవిత్రమైందని హిందువుగా పుట్టినందుకు గర్వపడాలన్నారు. హిందూ ధర్మాన్ని ఆచరించి ధర్మానికి పాటుపడి ప్రతీఒక్కరు ధర్మమార్గంలో పయనించిప్పుడే దేవుడు సేవతో పాటు దేశ సేవను కూడా కొనసాగించాలని అన్నారు. మానవ జీవితానికి భక్తి మార్గం అత్యంత ముఖ్యమైందని మానవ జీవితంలో దైవకార్యం ముఖ్య పాత్రని అన్నారు. ప్రతిఒక్కరూ ధర్మమార్గంలో ప్రయాణించి హిందూ ధర్మాన్ని ఆచరించాలన్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచే దైవభక్తిని అలవర్చాలన్నారు. కార్యక్రమంలో రామాలయ చైర్మన్ లచ్చావార్ నితిన్, కుర్మె సాయిలు, చంద్రశేఖర్, గంగారాం, గోపికృష్ణ, గోవర్ధన్, అనిల్, సంతోష్, సాయిలు, సాయికుమార్, బాలకృష్ణ, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ గర్భగుడిలో ప్రతిష్టించిన సీతారామ లక్ష్మణ విగ్రహాలు



కలగానే డిచ్‌పల్లి మున్సిపాలిటీ!

• ప్రతీసారి ఎన్నికల సమయంలో మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రకటనలు
• అధికారంలోకి రాగానే పట్టించుకోని రాజకీయ పార్టీలు



డిచ్‌పల్లి గుండా వెళ్తున్న 44వ జాతీయ రహదారి



మండలంలోని తెలంగాణ యూనివర్సిటీ

డిచ్‌పల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లిని మున్సిపాలిటీగా చేస్తామన్న ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల అనంతరం ఆ ఆ హామీని విస్మరిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన పార్టీ ఆ హామీని నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేస్తోంది. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి ప్రధాన కేంద్రంగా ఉన్న డిచ్‌పల్లి మండల కేంద్రం రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ తెలంగాణ యూనివర్సిటీతో పాటు, ఏడో పోలీస్ బెటాలియన్, సీఎంసీ మెడికల్ కళాశాల, ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలు, డిచ్‌పల్లి మండల కేంద్రంలో రైల్వే స్టేషన్ , తో పాటు జాతీయ రహదారి 44కూడా మండల కేంద్రం గుండా వెళ్తుంది. ఇన్ని సౌకర్యాలు ఉండటంతో చుట్టూ పక్కల మండలాలతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన ప్రజలు తమ వ్యాపారాల రీత్య డిచ్‌పల్లిలో స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో రోజురోజుకు డిచ్‌పల్లి విస్తీర్ణం పెరుగుతుపోతోంది. అందుకు సరిపడా ప్రజలకు మౌలిక సదుపాయలు కల్పించాల్సిన పంచాయతీలకు సామర్థ్యం సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురుఅవుతున్నాయి. విద్యాపరంగా డిచ్‌పల్లి ఒక హబ్‌గా ఏర్పాడింది. త్వరలోనే ఇక్కడ మెడికల్ కళాశాల రానుందని ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రకటించిన విషయం తెలిసిందే. అన్ని రంగాల్లో ముందుకెళ్తున్న డిచ్‌పల్లిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సైతం జోరుగా సాగుతోంది. లేఔట్లు, వెంచర్‌లలో భారీగా డిమాండ్ ఏర్పడింది. జిల్లాకేంద్రానికి కూతవేటుదూరం ఉండటం అన్ని వసతులు డిచ్‌పల్లి ప్రాంతంలో ఉండటంతో జనాలు సైతం డిచ్‌పల్లిలో ఉండటానికి ఇష్టపడతున్నారు. డిచ్‌పల్లి మండలకేంద్రంతోపాటు నడిపల్లి, అమృతపూర్, సుద్దపల్లి, ఘన్‌పూర్, ఖిల్లా డిచ్‌పల్లి పోలీస్ క్యాంప్, ముల్లంగి ఇలా అన్ని గ్రామాలు కలిసినట్టుగానే ఇక్కడ ఉంటాయి. డిచ్‌పల్లిని మున్సిపాలిటీగా చేస్తే మరింత అభివృద్ధి చెంది ఇక్కడి ప్రజలకు మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాలని డిచ్‌పల్లి వాసులు కోరుతున్నారు. ఈ విషయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చొరవ తీసుకోవాలని ఆయన సైతం గతంలో ఇదే డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేశారు. ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి ప్రభుత్వదృష్టికి తీసుకెళ్లి మున్సిపాలిటీ ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తూంపల్లి క్రీడాకారుల ఎంపిక

సిరికొండ, జూన్6 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలం తూంపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు బాలుర రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు నగేష్ తెలిపారు. తూంపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు నిజామాబాద్ సబ్‌జూనియర్ బాలుర హాకీ పోటీలను ఆర్మూర్‌లో నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలలో మంచి ప్రతిభకనబర్చిన క్రీడాకారులలో తూంపల్లికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ నగేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ఈనెల 9 నుండి 11వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరుగనున్నాయని ఆయన తెలిపారు. తూంపల్లి క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి పూసల రాములు, ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు, విద్యార్థులను అభినందించారు. నిజామాబాద్ హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ విద్యార్థులు రాష్ట్రస్థాయి కాకుండా జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభకనబర్చాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విశాల్, లోకేష్, సిద్ధూ, భరత్, శివశాంత్, అఖిల్, జశ్వంత్, వర్షిత్, కళ్యాణ్ క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు నాయక్ మెమోంటోలు ఇచ్చి అభినందించారు.

పేదలకు వరం.. సీఎంఆర్‌ఎఫ్!

• ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తుకు ప్రత్యేక వెబ్‌సైట్ • ఖరీదైన వైద్యానికి ఎల్‌వోసీ ఆసరా • జుక్కల్‌లో ఇప్పటివరకు 2,334 మంది 5.38 కోట్ల సర్కారు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు (ఫైల్)

మద్నూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం ఖరీదైనదిగా మారడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెనుభారమయ్యాయి. ఈ నేపథ్యంలో సీఎం సహాయ నిధి వారికి వరంల మారింది. ప్రాణాంతక, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేదలకు వైద్య సదుపాయం అందించేందుకు సీఎం సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన వ్యక్తులకు ఆర్థిక సాయం కోసం సీఎం ఆర్ ఎఫ్ రూపదించబడింది. నిమ్స్ ఎంఎస్‌జె క్యాన్సర్ హాస్పిటల్ ప్రభుత్వ ఇఎన్టి హాస్పిటల్ వంటి నిర్దిష్ట ఆసుపత్రుల్లో చికిత్స కోసం లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసి) అందిస్తుంది. రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాని వైద్య చికిత్సల కోసం డబ్బు ఖర్చు చేసిన వారికి సాయం చేస్తూ ఆత్మబంధువుగా సీఎం మారింది. ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించగా 2024 జూలైలో ఆన్ లైన్ దరఖాస్తుల స్వీకరణకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు.

ఆపత్కాలములో అండగా..

పేదల వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం అందించేందుకు సీఎం సహాయ అనేది ఎంతో దోహదపడుతోంది. తెల్లరేషన్ కార్డుదారులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఆరు నెలలలోపు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మీసేవ దరఖాస్తు ఫారాలతో ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫొటో ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, వైద్య ఖర్చుల బిల్లులు బ్యాంకు వివరాలు మొబైల్ నెంబర్ వంటి సరైన ధ్రువపత్రాలతో వివరాలను తెలంగాణ అధికారిక వెబ్ సైట్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం అవసరమైన పత్రాలను దరఖాస్తుతో జతచేసి ఎమ్మెల్యే, ఎంపీలకు సమర్పించాలి.

ఖరీదైన వైద్యానికి ఎల్‌వోసీ

అయితే వైద్యానికి ఎక్కువ మొత్తంలో అవసరమైనప్పుడు ఎల్‌వోసీ ఇస్తారు. నిమ్స్, ఎంఎస్‌జే, క్యాన్సర్ ఆసుపత్రి, ప్రభుత్వ ఇఎన్‌టీ ఆసుపత్రుల్లో చికిత్సల కోసం వెళ్లిన రోగులకు అయ్యే ఖర్చుల వివరాలు చెబితే ఈ ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను ఎమ్మెల్యేలు అందజేస్తారు.

జుక్కల్‌లో రూ.5.38 కోట్లసాయం: ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద ఎనిమిది మండలాల్లో 2,334 మంది బాధితులకు ప్రభుత్వం రూ.5.38కోట్ల ఆర్థిక సాయం అందజేసింది. పేదల వైద్యం కోసం ఆర్థిక సాయం అందించేందుకు సీఎం సహాయ నిధి ఎంతో దోహదపడుతుంది. బాధితులు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అనంతరం తగిన ధృవపత్రాలతో జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేయాలి. వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందజేయడానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.



ఉద్యోగులను సన్మానిస్తున్న సీపీ

ఉద్యోగ విరమణ సిబ్బందికి సీపీ సన్మానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీస్ శాఖ హోంగార్డు వింగ్‌లో శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన డి.శ్రీనివాస్‌ను సీపీ సాయిచైతన్య ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖలో హోంగార్డుగా 32 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకొని శ్రీనివాస్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎంతో ఒత్తిడితో కూడుకున్న పోలీస్ శాఖలో ఎలాంటి రిమార్క్ లేకుండా ఉద్యోగ విరమణ చేయడం గొప్ప విషయమని భవిష్యత్తులో ఎలాంటి అవసరం ఉన్నా అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తామని సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ రామచంద్రా రావు, సతీష్, శ్రీనివాస్, తిరుపతి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్న నేరస్థుడి అరెస్టు

నిజామాబాద్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 24 కేసులలో నాన్ బెయిల్ వారెంట్ ఇష్యూ అయి పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నటు వంటి నేరస్థుడిని నిజామాబాద్ సీసీఎస్ పోలీసులు పట్టుకున్నట్లు సీపీ సాయి చైతన్య తెలిపారు. కామారెడ్డి జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నటువంటి బబ్లు బాలాజీ గైక్వాడ్ నాందేడ్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన పాత నేరస్తుడిని నిజామాబాద్ సీసీఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకొని కామారెడ్డి పోలీసులకు అప్పగించారు. ఇతని కోసం పోలీసులు గత కొన్ని సంవత్సరాలుగా వెతుకుతున్నారు. నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో నేరాలు చేసేందుకు తిరుగుతున్నట్లు సమాచారం రాగా సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ పోలీసులు బబ్లును పట్టుకున్నారు. ఇతన్ని పట్టుకోవడంలో కృషి చేసిన సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి, సీఐ సురేష్‌లు, సిబ్బందిని సీపీ అభినందించారు.

వడ్డీ వ్యాపారం చేస్తున్న కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

నిజామాబాద్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో మెండోరా పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న గంగాధర్‌పై బాధితులు ఫిర్యాదు చేయగా అతనిపై రెండు కేసులు నమోదయ్యాయి. అతనిపై సీపీ విచారణకు ఆదేశించగా నివేదిక ప్రకా రం కానిస్టేబుల్‌పై సీపీ సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తుంది. వడ్డీ వ్యా పారాలు, ఉద్యోగాల పేరుతో మోసం, ఇలా ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల విషయంలో సీపీ సాయిచైతన్య కఠినంగా వ్యవహరిస్తున్నారు. గత రెండు మూడు నెలల్లో ముగ్గురు కానిస్టేబుళ్లను సీపీ సస్పెండ్ చేశారు. గంగాధర్‌పై రూరల్ పోలీస్ స్టేషన్‌లో అధిక వడ్డీ వసూలు చేస్తున్నట్లు బాధితులు ఫిర్యాదు చేయగా సీపీ సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం.

కులం పేరుతో దూషించిన ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష

నిజామాబాద్ లీగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన ఇద్దరు వ్యక్తులకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు జిల్లా సెషన్స్ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే తొమ్మిది సంవత్సరాల క్రితం ముద్దయి గంగోల్లా భవాని అనే మహిళకు వ్యాపారం చేసుకునేందుకు రూపాయలు 5 లక్షలు 2.7.2016 నాడు ఆర్మూర్ నివాసి అయిన మేకల సురేష్ అప్పుగా ఇచ్చాడు. ఈ డబ్బులు తిరిగి అడుగగా ముద్దాయి భవాని తన వద్ద ఉన్న అకౌంట్ క్లోజ్ అయినా చెక్‌ను అతనికి ఇవ్వగా అది చెల్లకపోవడంతో వారు న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు ఇవ్వగా దానికి ముద్దాయి, తన స్నేహితుడు వంగపల్లి వెంకటయ్య ఇద్దరు కలిసి మేకల సురేష్‌ను కులం పేరుతో దూషించడంతో సురేష్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకోని విచారణ జరపగా ఇద్దరినీ భవాని, వెంకటయ్యకు చెరో ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రైతులకు పంటలపై అవగాహన

మోపాల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చేలా పంటలు పండించాలని రుద్రూర్ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మోపాల్ మండల కేంద్రంలో రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రైతులు ఒకే పంట కాకుండా వివిధ రకాల పంటలను తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా పంటలు పండించాలని కోరారు. రైతులు రసా యనిక ఎరువులను తగ్గించే విధంగా చూడాలన్నారు. అనేక మంది రైతులు ఒకే పంటను పండిస్తున్నారని అలా కాకుండా అన్ని రకాల పంటలు పండించినట్లయితే రైతులు అధిక దిగుబడులు పొందుతారని అన్నారు. వివిధ పంటలపై రైతులకు పూర్తి అవగాహన శాస్త్రవేత్తలు కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లను నిర్మించండి

● రూరల్ ఎమ్మెల్యేకు వినతి

మోపాల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 4వ డివిజన్‌లోని మాధవనగర్ నర్సన్న కెనాల్‌కట్ట కాలనీలో నివసి స్తున్న 80 మంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. కొన్నేళ్ల నుంచి కట్టపై గుడిసెలు వేసుకొని నివసిస్తున్నామని వారు ఎమ్మెల్యేకు వివరించారు. గత పాలకులు పట్టాలు ఇస్తామని చెప్పారు తప్ప ఇవ్వలేక పోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇళ్ల ప ట్టాలు ఇవ్వాలని కోరుతూ అధికారులకు, నాయకులకు ఎన్నోసార్లు వినతి పత్రాలు సమర్పించడం జరిగిందని వివరించారు. ఇప్పటికైనా మీరు పేద లకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరికొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలం చీమన్‌పల్లి, సిరికొండ తదితర గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మం జూరైన ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అందజేశారు. సిరికొండ, చీమన్‌పల్లి, తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో చెక్కులను బాధిత కుటుంబా లకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు దేగం సాయన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహా యం మంజూరు అవుతుందంటే అది పేదలకు ఉపయోగపడేలా ఉండాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆకాంక్షిస్తున్నారన్నారు. ఆయన ఆదేశానుసారంగానే మంజూరైన ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబాలకు అందజేస్తున్నామని సాయన్న చెప్పారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయన్న, భాస్కర్‌రెడ్డి, రమేష్, ప్రేమ్ కుమార్, జితేందర్‌సింగ్, శ్రీనివాస్, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

9న దోస్త్ ప్రత్యేక కేటగిరి సర్టిఫికేట్ వెరిఫికేషన్

డిచ్‌పల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని 2025-26 విద్యా సంవత్సరానికి దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి పీహెచ్‌సీ దివ్యాంగులు) సీఏపీ ఎన్‌ఎస్‌సీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కర్యుకులర్ యాక్టీవిటీస్ విద్యార్థులకు ఈ నెల 9న సర్టిఫికేట్ పరిశీలన వర్సిటీలోని అడ్మిషన్ కార్యాలయంలో ఉంటుందని దోస్త్ కో ఆర్డినేటర్ వాసం చంద్రశేఖర్ తెలిపారు. ఈ విద్యార్థులు అన్ని సర్టిఫికేట్‌లు రెండు జతల జిరాక్స్‌లు, ఒరిజినల్‌లతో ఉదయం 10 గంటలకు నుంచి సాయంత్రం 5 గంటల మధ్య హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

ముల్లంగి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ

● రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని ముల్లంగి గ్రామ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే డా.రేకుల పల్లి భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ముల్లంగి గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన మహాలక్ష్మీ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతుల శ్రేయస్సు దృష్ట్యా మంచిప్ప సాగునీటి ప్రాజెక్టు త్వరతిగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని త్వరలోనే రైతులకు సాగు నీరు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మహిళల కోసం మహిళ భవనం నిర్మిస్తామని గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సీసీ డ్రైనేజీలకు నిధులను మంజూరు చేయడంతో పాటు మహాలక్ష్మీ ఆలయం, శివాలయం ఆలయాల ప్రహారీలకు నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. ఐమ్యాక్స్ లైట్లు ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాటిపల్లి నగేశ్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎంపీగా ధర్మపురి అర్వింద్‌కు ఓట్లు వేసిన ముల్లంగి గ్రామస్థులకు ఎలాంటి అభివృద్ధి చేయాలేదని రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాలు హస్తగతం చేసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు చిన్నోళ్ల నర్సయ్య, కంచెట్టి గంగాధర్, మాజీ సర్పంచ్ లావణ్య మధు, కాంగ్రెస్ నాయకులు, పెద్దోళ్ల శ్రీనివాస్, గంగారెడ్డి, శేఖర్ గౌడ్, రాజేశ్వర్, సురేశ్, భాస్కర్, అంజయ్య, రాంచందర్‌గౌడ్, డాక్టర్ షాదుల్ల పాల్గొన్నారు.



ముల్లంగిలో మహాలక్ష్మీ ఆలయం శిలఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీపావత్ బాలు, బట్టు గోపాల్, నాయకులకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కా ర్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి, నాయకులు సంతోష్‌నాయక్ ఉన్నారు.

పాటల సీడీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన రచయిత సాయి రచించిన తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు, చరిత్ర, అస్తిత్వం, ఉద్యమాల పోరాటాలు ప్రతిబింబించేలా రాసిన పాటల సీడీని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం సాయికుమార్ ఆధ్వర్యంలో కళాకారులు ఎమ్మెల్యేను కలిశారు.

వధూవరులను ఆశీర్వదించిన రూరల్ ఎమ్మెల్యే

మోపాల్: నిజామాబాద్ రూరల్ మాజీ ఎంపీపీ యాదగిరి కుమారుడి పెళ్లి శుక్రవారం బోర్గాం(పి) మోటాటి రెడ్డి కల్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, సాయరెడ్డి, ఆయా గ్రామాల సొసైటీ చైర్మన్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు మరిచి కేసీఆర్‌పై విమర్శలు సరికాదు

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజలకు ఇచ్చిన హామీలు మర్చి కేసీఆర్‌పై తిట్లతోనే రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆలేరు సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ముఖ్యమంత్రి స్థాయిని సైతం విస్మరించి కేసీఆర్‌పై అనరాని మాటలతో విమర్శించడం ఎంతవరకు సమంజసమని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి తన వంకర బుద్ధిని మార్చుకోకుండా సీఎం కుర్చీ రాగానే భజారు భాషా పోవడం లేదని అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా ఇంకా కేసీఆర్ మీదే పడి ఏడుస్తున్నారని అన్నారు. కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ ముందు హాజరుకాను అనలేదని మరో తేదీని అడిగారని అన్నారు. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ ప్రజలకు, నిరుద్యోగ యువతకు, మహిళలకు, రైతులకు, యువతులకు, విద్యార్థులకు ఎన్నో రకాల హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా 18 నెలలు పాలన చేశారన్నారు. యాదగిరి నర్సింహస్వామి సాక్షిగా రైతు భరోసా, రైతు రుణమాఫీ అమలు చేస్తానని చెప్పి పూర్తిస్థాయిలో అమలు చేయకపోగా బీఆర్ ఎస్ ప్రభుత్వంపై కక్షపూరితంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ఢిల్లీలో దొంగల్లాగా చూస్తున్నారని ఒక్క పైసా కూడా అప్పు పుట్టడం లేదని ఉద్యోగస్తులకు నన్ను కోసినా ఒక్క రూపాయి లేదు అని చెప్పి ఆలేరులో రూ.1300 కోట్లతో అభివృద్ధి పనులకు ఎలా శంకుస్థాపన చేశారని అలాగే కొత్త మెట్రో రైలు అభివృద్ధి ఖర్చుకు 19వేల 579 కోట్ల రూపాయలు ఎలా ఖర్చు చేశారని, 33వేల కోట్లతో హ్యామ్ మాడల్‌తో ఆర్‌అండ్‌బీ మరియు పంచాయతీ రోడ్ల అభివృద్ధి చేస్తామని ఎలా నిర్ణయాలు తీసుకున్నారన్నారు. అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో జోడెడ్ల లాగా ముందుకు తీసుకెళ్లి తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌దని మంచి పాలన ఉన్న తెలంగాణను ప్రజలు రేవంత్‌రెడ్డికి అప్పచెబితే వాటిని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు.

రెవెన్యూ మంత్రి పొంగులేటిని కలిసిన జిల్లా ట్రెసా నాయకులు



మంత్రిని కలిసిన ట్రెసా నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ట్రెసా జిల్లా నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల తిరుగు బదిలీ విషయంలో క్యాబినెట్ ఆమోదం తెలపడం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా క్యాబినెట్ ఆమోదం తెలపడంలో ముఖ్యపాత్ర వహించిన ప్రభుత్వ సలహాదారుడు నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిలకు జిల్లా ట్రెసా కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతంకుమార్, రాజ్‌కుమార్, రమణారెడ్డి, నిరంజన్, చక్రవర్తి, వకీల్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

డిచ్‌పల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ సమస్యలు పరిష్కారం గాకుండా అపరిక్షుతంగా ఉన్న వాటిని పరిష్కరించాలని గ్రామీణ ప్రాంత రైతులు తమ వినతులను రెవెన్యూ అధికారులకు శుక్రవారం అందజేశారు. మండలంలోని బర్దిపూర్‌లో జరిగిన సదస్సులో తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఆర్‌ఐ సంతోశ్ లకు 185దరఖాస్తులు అంద జేయడం గమనించదగ్గ విషయం ఖిల్లా డిచ్‌పల్లిలో డీటీ శ్రీకాంత్ , ఎమ్ఆర్ఐ ప్రభులకు 78 దరఖాస్తులు రైతులు అందజేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు ఎంతో దోహదం చేస్తాయని గత ప్రభుత్వ హాయంలో ఈ సమస్యలు పరిష్కారం నోచుకగొక దరఖాస్తులు పెరిగి పోయాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

డివిజన్ పెంపుపై అపోహలు వద్దు

● నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్

సుభాష్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌ల పెంపుపై ప్రజలు అపోహలకు లోనుకావద్దని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ అన్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి డివిజన్‌ల పెంపుపై కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి డివిజన్‌ల పెంపుపై ఎలాంటి జీవో రాలేదని డివిజన్‌ల పెంపుపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. కరీంనగర్, జగిత్యాల్, తదితర ప్రాంతాల్లో నూతనంగా కార్పొరేషన్‌లు ఏర్పాటైన వాటిలో మాత్రమే డివిజన్‌ల పెంపు ఉందని నిజామాబాద్ కార్పొరేషన్‌కు డివిజన్‌ల పెంపు ఇప్పటి వరకైతే లేదన్నారు. ప్రభుత్వం నుంచి డివిజన్‌ల పెంపుపై జీవో వస్తే ప్రజా ప్రతినిధులకు తెలియజేస్తామ న్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రక్రియపై దినేష్‌కులాచారి ప్రశ్నించగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు హౌజింగ్ పీడీకి సంబంధించిందని తమ పరిధిలో లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్, వేణుగోపాల్, మాయావర్ సాయిరాం, వెల్డింగ్ నారాయణ, పద్మారెడ్డి, సాయివర్ధన్, రాఘవేందర్, ఆమంద్ విజయ్‌కృష్ణ, ఆకుల శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మండల, గ్రామ కమిటీల నిర్మాణం చేపట్టాలి

సుభాష్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల, గ్రామ కమిటీల నిర్మాణాన్ని చేపట్టాలని ఎంఆర్‌పీ ఎస్ రాష్ట్ర నాయకులు ఇరుగుపైడి, కుడాల స్వామి, అజయ్‌లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర నాయకులు ఇరుగుపైడి, కుడాల స్వామి, అజయ్‌లు మాట్లాడుతూ జూలై 7న జరగబోయే 31వ ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలో కనీవిని ఎరుగని రీతిలో జరపాలని తెలిపారు. ప్రతీ గ్రామంలో కమిటీలను వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నూత్‌పల్లి మారుతి, నాయకులు గంగాధర్, నందిపేట్ మండల కన్వీనర్ పైడాకుల ప్రశాంత్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● వైద్యాధికారులకు డీఎంహెచ్‌వో ఆదేశం

నిజామాబాద్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండి క్షేత్రస్థాయిలో ప్రతీ గ్రామ, వార్డు పరిధిలో వివిధ శాఖలు సమన్వయంతో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ కీటకజనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి సమావేశం శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వివిధ శాఖలు సమన్వయంతో సీజనల్ వ్యాధులపై చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు గృహ సందర్శనలు, జ్వర సర్వేలు నిర్వహించి అనుమానిత కేసులకు చికిత్స అందించాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ తుకారాం రాథోడ్, వెంకటేశ్, సామ్రాట్ యాదవ్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం సాధారణ ప్రసవాలు

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్‌లో అధికారులకు, ఉద్యోగులకు యోగా శిక్షణ, అవగాహన కల్పించారు. జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ జె.గంగాదాస్ మాట్లాడుతూ ఆరోగ్యం ప్రాముఖ్యతను వివరిస్తూ ఉద్యోగుల మానసిక ఒత్తిడి నివారణకు యోగా చక్కని మార్గం అన్నారు. గర్భిణులకు నార్మల్ డెలివరి అవడానికి యోగా తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

నిజామాబాద్ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతో జిల్లాలోనే ప్రత్యేక స్థానాన్ని అందుకున్న ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తిరుమల శ్రీనివాస్ ఆర్య నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా మద్దుకూరి సాయిబాబు, ఉపాధ్యక్షులు సుజాత, ప్రధాన కార్యదర్శి బాలకిషన్, సంయుక్త కార్యదర్శి రాజేష్‌శర్మ, కోశాధికారి జయదేవ్ వ్యాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుజాతరెడ్డి, గంగాధర్, సంతోష్‌రెడ్డిల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సాయిబాబు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఎప్పుడు సమాజ సేవలో ముందుంటారని అన్నారు.

వామ్మో.. జూన్!

(ఐదో పేజీ తరువాయి)

ఉంటేనే అనుమతులు ఇవ్వాల్సి ఉండగా ఇంకా నిర్మాణం పూర్తికాని పాఠశాలలు సైతం విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందని హడావిడిగా అనుమతులు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా విద్యాశాఖలో కిందిస్థాయి సి బ్బంది అనుమతుల జారీ విషయంలో అన్ని తామై వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నిబంధనలు పాటించకుండానే కొన్ని పాఠశాలలు షిఫ్టింగ్ పర్మిషన్లు పొందగా, కొన్ని పాఠశాలలకు ఇంకా షిఫ్టింగ్ అనుమతులు రాకుండానే ఆ పాఠశాలలను ప్రస్తుతం ఉన్న ప్రదేశం నుంచి ఇతర ప్రదేశాలకు మార్చినప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

ఆలయాల ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల విగ్రహాల ప్రతిష్ఠాపన పూజల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. శుక్రవారం సీతారాంనగర్ కాలనీలోని భక్త గణేష్ ఆంజనేయస్వామి, నాందేవ్‌వాడ మహామైసమ్మ దేవాలయం, న్యాల్‌కల్ రోడ్‌లోని శ్రీరామ శ్రీదాస ఆంజనేయస్వామి దేవాలయాల ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ఆలయాల పరిరక్షణ మనందరి బాధ్యత అని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని సంస్కృతి సాంప్రదాయాన్ని భావితరాలకు అందించాలని సూచించారు. శ్రీరామ దాస ఆంజనేయస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యేకు పండితులు కంధాళై నర్సింహమూర్తి, కలకుంట్ల శ్రీధరాచార్య, గోవర్ధనం శశికుమార్ ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆలయాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సారంగపూర్ ఆలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పూజలు



మహిళలతో ఎమ్మెల్సీ కవిత

మోపాల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని సారంగపూర్ హనుమాన్ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన వీరు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సారంగపూర్ వీడీసీ పెద్దలు, ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ కవిత

మోపాల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండ లం లోని మల్కాపూర్ తండాలో మాజీ ఎంపీపీ అనుష కూతురు వివాహం, మాజీ ఎంపీటీసీ గంగారాం తమ్ముడి వివాహం ఇటీవల జరిగింది. వీరిని శుక్రవారం ఎమ్మెల్సీ కవిత ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

నిజామాబాద్ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో అమాయకులను మోసం చేస్తున్న బొంబాయికి చెందిన పాండురంగ్ సుభాష్ మహ పంకర్ అలియాస్ సాగర్ అనే వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆయన చేతిలో మోసపోయిన శ్రవణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ జరిపి నిందితుడిని పట్టుకొని కోర్టులో హాజరు పర్చారు. పెట్టుబడి పేరుతో 31లక్షల 36వేల 900 రూపాయలను శ్రావణ్ కుమార్ అకౌంట్ నుంచి తీసుకొని మోసం చేశాడు. సాగర్‌పై దేశవ్యాప్తంగా 38 కేసులు నమోదు అయ్యాయి. మహారాష్ట్రలో ఉంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడు. పోలీసు ఉన్నతాధికారు ల ఆదేశాల మేరకు సీసీపీఎస్ సీఐపీ ముఖీద్‌పాషా, సీసీపీఎస్ సిబ్బంది సురేష్, నాగభూషణం, ప్రవీణ్, నరేష్‌లు ఈనెల 1వ తేదీ మహారాష్ట్ర వెళ్లి 5వ తేదీన అతన్ని పట్టుకొని ఇక్కడ కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జుడిషియల్ రిమాండ్ విధించి జైలుకు పంపినట్లు సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు!

● ఘన్‌పూర్ బడిబాట కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్

డిచ్‌పల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఘన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అంగన్‌వాడీ టీచర్‌లతో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సర్కార్ అన్ని సౌకర్యాలతో పాటు మంచి విద్య అందిస్తున్నారని ఈ సంవత్సరం నుంచి విద్యార్థులను ప్రైవేట్‌కు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. విద్యార్థులకు ఉచితంగా స్కూల్ యూనిఫాం, స్పోర్ట్స్ డ్రెస్, ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని ప్రైవేట్‌లో చేసే ఖర్చును నిలిపివేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు లభిస్తుందన్నా రు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, వీడీసీ సభ్యులు గంగాధర్, తిరుపతి, మహేందర్ పాల్గొన్నారు.